

స్ట్రాంగ్ రూములు సిద్ధం చేయాలి

జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్‌రూములు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో స్ట్రాంగ్‌రూములు సిద్ధం చేయడంపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు, ఇవిఎంలు, వివిప్యాట్స్ భద్రపర్చేందుకు జిల్లాలోని ఐదు స్ట్రాంగ్‌రూమ్‌లను ఈ నెలాఖరు నాటికి సిద్ధం చేయాలన్నారు. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, పెనుగొండ మండలాల్లోని ట్రెజరీ కార్యాలయాల్లో ఉన్న స్ట్రాంగ్‌రూముల్లో ఉన్న మెటీరియల్ వేరేచోట భద్రపర్చి సిద్ధం చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించకుండా తమ సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించంపై అంగన్వాడీలు భగ్గుమన్నారు. మొదటి నుంచి సమస్యలపై సానుకూలంగా చర్చించకుండా కేంద్రాల తాళాలు పగులగొట్టడం, నోటీసులిచ్చి బెదిరించడం, తాజాగా ఎస్మా ప్రయోగం ఇవన్నీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని దుయ్యబట్టారు. ప్రభుత్వం తీరు మార్చుకుని సమస్యలు పరిష్కరించకపోతే తాము విధుల్లోకి చేరేది లేదని స్పష్టం చేశారు. ఇదే తీరు కొనసాగిస్తే మూడు నెలల్లో ఈ ప్రభుత్వాన్నే ఇంటికి పంపుతాం అంటూ ఘాటుగా హెచ్చరించారు. జిల్లాలో అంగన్వాడీల సమ్మె 26వ రోజు వివిధ నిరసనల నడుమ కొనసాగింది.



తణుకులో..

ఎస్మాను తిప్పికొడతాం

ప్రభుత్వ తీరుపై భగ్గుమన్న అంగన్వాడీలు

పలుచోట్ల జిఒ ప్రతులు దహనం

జిల్లా కేంద్రాల్లో 24 గంటల రిలే నిరాహారదీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

అంగన్వాడీల సమ్మె 26వ రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు మైలే విజయలక్ష్మి, పి.పద్మ, పి.నాగలక్ష్మి, సత్యవతి, శ్రీదేవి, సుజాత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

26 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆచంట మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి వద్ద అంగన్వాడీలు వాపోయారు. కచేరి సెంటర్లో సమ్మె శిబిరం తెలియజేస్తున్నారు.

తణుకు రూరల్: అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగంతో ఈ ప్రభుత్వానికి కాలం చెల్లిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు అడబాల అజయకుమారి, నేత కామన మునిస్వామి అన్నారు. స్థానిక కోర్టు వద్ద అంగన్వాడీలు తమ 26వ రోజు సమ్మెలో భాగంగా కుర్చీలు తిరగేసి నెత్తిపై పెట్టుకుని మా జోలికొస్తే మీ కుర్చీ తిరగబడుతుందని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రమీల, జ్యోతి, నాగరత్నం, భూదకాళీ, మణిమాలతి, భువనేశ్వరి, లక్ష్మి, వరహాలు, మధుశీల, వరలక్ష్మి, మాధవి, విజయలక్ష్మి, కనక మహాలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పోడూరు: అంగన్వాడీలు సమ్మెలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద పచ్చగడ్డి తింటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో నేతలు పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడు కుమారి తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: అంగన్వాడీలు సమ్మెలో భాగంగా శనివారం రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బి.రామకోటి మాట్లాడగా డి.సత్యవతి, చంద్రకళ, భవాని, సత్యవాణి, రాణి, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

కాళ్ల: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా నేత దావులూరి మార్తమ్మ మాట్లాడగా సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, అంగన్వాడీలు ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర): స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా జిఒ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కెఎస్.ప్రసాద్ మాట్లాడగా అంగన్వాడీలు భవాని, లక్ష్మి దుర్గ, మంగతాయారు పాల్గొన్నారు. కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు సంఘీభావం తెలిపారు.

మొగల్తూరు: అంగన్వాడీలు తమ సమ్మెలో భాగంగా 26వ రోజు శనివారం ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పెద్దింట్లు, సారమ్మ, సీత, నాగలక్ష్మి, రేఖ శాంభవి పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: అంగన్వాడీలు సమ్మెలో భాగంగా స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు.

కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, అంగన్వాడీ నేతలు జి.శ్రీలక్ష్మి, నిర్మలకుమారి, జి.రాజేశ్వరి, జి.వెంకటలక్ష్మి, జి.విజయలక్ష్మి, బి.నాగలక్ష్మి, రాజేశ్వరి, రత్నకుమారి, ఎ.నీలిమ పాల్గొన్నారు.

పెనుగొండ: అంగన్వాడీలు ప్రభుత్వ నిర్బంధకాండను నిరసిస్తూ ఎస్మా జిఒ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నేత ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీలు నాగలక్ష్మి, భవాని, హైమ, పలువురు ఆయాలు పాల్గొన్నారు.

అత్తిలి: తహశీల్దార్ కార్యాలయం అంగన్వాడీలు వంటావార్పు నిర్వహించారు. ఈ సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, నేతలు సందర్శించి సంఘీభావం తెలిపి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు కేతా గోపాలన్, దాయం వెంకన్న, ధర్మేంద్ర, శిరోమణి, ఈశ్వర్, స్వామి, అప్పలరాజు, శ్యామల దేవి, సత్యకుమారి, రాధాకుమారి, పోసియ్య, రామారావు, నాగుల మీరా, ఆంజనేయశర్మ, అంగన్వాడీలు తులసి, మాధవి, దీపిక, దుర్గాదేవి, సత్యవతి పాల్గొన్నారు.



పెనుమంట్రలో..

ఆకివీడు: ప్రభుత్వం కళ్లు మూసుకుని తమ సమస్యలను పట్టించుకోకుండా ఎస్మాతో బెదిరించాలనుకోవడం అవివేకమని అంగన్వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ నేతలు కృష్ణవేణి, కృష్ణకుమారి, సీతామహాలక్ష్మి, పైడేశ్వరి, బేబీరాణి, ఇరానీదేవి, కనకదుర్గ మాట్లాడారు.



ఆకివీడులో..

తాడేపల్లిగూడెం: అంగన్వాడీల సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు ఖండించారు. అంగన్వాడీలు 26వ రోజు సమ్మెలో భాగంగా 26 అంకె ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. స్వరూపరాణి అధ్యక్షతన జరిగిన ఆందోళనలో బాబూరావు మాట్లాడారు. స్వాతంత్ర సమరయోధులు, ప్రజాఉద్యమ నేత అన్నే వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు కరెడ్ల రామకృష్ణ, యడవల్లి దుర్గారావు పాల్గొన్నారు.



భీమవరంలో..

ఉండి: అంగన్వాడీలు తమ సమ్మెలో భాగంగా శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. అంగన్వాడీ మండల నేతలు ఎం.చైతన్య, డి.సత్యవేణి మాట్లాడగా ఝాన్సీ, చిట్టి మరియ, వెంకటలక్ష్మి, గడి కుసుమ, లలిత కుమారి, ప్రేమలత పాల్గొన్నారు.

పాలకొల్లు: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు శనివారం తమ సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ మాట్లాడగా నేతలు ఎం.శ్రీదేవి, బి.నాగలక్ష్మి, పి.పద్మావతి, జి.ఝాన్సీరాణి, బి.అభిరాణి, ఎం.భవాని పాల్గొన్నారు.

హామీల అమలే సమ్మెకు పరిష్కారం

24 గంటల దీక్షల ప్రారంభంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్

భీమవరం రూరల్: తాళాలు పగులగొట్టి, నిర్బంధం ప్రయోగించి ప్రభుత్వం సాధించేదేమీ ఉండదని, సమస్యలు పరిష్కరించడమే సమ్మెకు పరిష్కారమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. అంగన్వాడీల సమ్మె 26వ రోజుకు చేరిన సందర్భంగా శనివారం భీమవరంలో జిల్లాస్థాయిరిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. నోటీసులిచ్చి తొలగిస్తామని అంగన్వాడీలను భయపెట్టే ప్రయత్నం తప్ప సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి కన్పించడం లేదని, దానివల్ల నష్టపోయేది ప్రభుత్వమేనని అన్నారు. దీక్షలో కూర్చున్న యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.ఝాన్సీలక్ష్మి, నేతలు కె.సీతామహాలక్ష్మి, కె.అరుణ సంధ్య, పి.విజయలక్ష్మి, వై.స్వర్ణకుమారిలకు ఎర్రమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడుతూ పదో తేదీ వరకూ 24 గంటల రిలే నిరాహారదీక్షలు సాగుతాయన్నారు. దీక్షలకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పద్మజ, జనసేన నాయకులు గోడపాటి పెదబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎల్ఎస్.కుమారి, రాజేశ్వరి, గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకులు ఎం.ఆంజనేయులు, రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఇంజేటి శ్రీనివాస్ మద్దతు తెలపగా అంగన్వాడీ నాయకులు ఎమ్‌డి.హసీనా, ఉషారాణి, తులసి, మార్తమ్మ తదితరులు నాయకత్వం వహించారు. అనంతరం ఎస్మా జిఒ కాపీలను దహనం చేశారు.

ఎస్మా ప్రయోగం సిగ్గుచేటు

కార్మిక సంఘాల నేతలు విమర్శ

భీమవరం, భీమవరం రూరల్: అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం సిగ్గుచేటని కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో కార్మిక సంఘాల సమావేశం జరిగింది. సమావేశంలో ఎఐటియుసి జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, టిఎన్‌టియుసి నాయకులు ఎం.గణపతి, ఎఐసిటియు నాయకులు నాని మాట్లాడరు. అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా ఈనెల 9న ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు బాబాజీ, మేరీ, సంతోషి మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె విజయవంతం కావాలని అన్నారు. సమావేశంలో బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

చంద్రబాబు జోష్ నింపేనా..!

టిక్కెట్లపై స్పష్టత కోసం తెలుగుతమ్ముళ్ల ఎదురుచూపు

ఆచంట, పాలకొల్లు, తణుకుపై స్పష్టత

జనసేనతో పొత్తు నేపథ్యంలో మిగిలిన సీట్లపై కొనసాగుతున్న సస్పెన్స్

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి అధినేత చంద్రబాబు ఆచంటలో ఆదివారం నిర్వహించనున్న 'రా.. కదిలి రా' సభలో ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఈ సభకు సంబంధించి ఇప్పటికే మాజీమంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యాన విస్తృత ఏర్పాట్లు చేశారు. జన సమీకరణకు సంబంధించి సైతం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే పశ్చిమగోదావరి జిల్లాలో పోటీ చేసే స్థానాలు, టిక్కెట్ల కేటాయింపుపై ఈ సభలో ఏమైనా స్పష్టత లభిస్తుందా, లేదా అనే మీమాంస తెలుగుతమ్ముళ్లలో నెలకొంది. ప్రధానంగా జనసేనతో పొత్తు నేపథ్యంలో ఏయే సీట్లు జిల్లాలో జనసేనకు కేటాయిస్తారనే సస్పెన్స్ కొనసాగుతోంది. ఇప్పటికే ఆచంట, పాలకొల్లు, తణుకు స్థానాల్లో టిడిపి నుంచి బరిలోకి దిగే అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. పాలకొల్లులో సిట్టింగ్ ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఆచంటలో మాజీమంత్రి పితాని సత్యనారాయణ, తణుకులో మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అభ్యర్థిత్వాలకు ఎటువంటి ఇబ్బందీ లేదు. మిగిలిన భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, ఉండి స్థానాలపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఉండిలో టిడిపి నుంచి సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు ఉన్నారు. అయితే ఇక్కడ మాజీ ఎంఎల్ఎ వి.శివరామరాజు (శివ) కూడా టిక్కెట్ రేసులో ఉన్నారు. వీరిలో ఎవరికి టిక్కెట్ దక్కుతుందనేది స్పష్టత రావాల్సి ఉంది. ఇక భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం సీట్లను జనసేన కోరుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఓ విధంగా చెప్పాలంటే భీమవరం మినహా నరసాపురం, తాడేపల్లిగూడెంలో బలమైన అభ్యర్థులు టిడిపి నుంచి లేరనే చెప్పొచ్చు. ఈ పరిస్థితుల్లో ఈ మూడు సీట్లను జనసేనకు వదిలేస్తారా లేక రెండు సీట్లే కేటాయిస్తారా.. ఆ రెండు ఏమిటనే చర్చ అటు తెలుగు తమ్ముళ్లలోనూ, ఇటు జనసైనికుల్లోనూ పెద్దఎత్తున సాగుతోంది. అలాగే నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ సీటు జనసేనకు వదిలేస్తారా లేక టిడిపినే బరిలోకి దిగుతుందా అనే చర్చ కూడా ఉంది. నరసాపురం లేదా కాకినాడ ఎంపీ సీట్లలో ఏదోక సీటును జనసేన కోరుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో ఈ సభలో చంద్రబాబు స్పష్టత ఇస్తారా లేక రాజకీయ ప్రచారానికే పరిమితమై మరికొన్ని రోజులు సస్పెన్స్ కొనసాగిస్తారా అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



ఆచంటలో సభా ప్రాంగణం

నేడు ఆచంటలో చంద్రబాబు సభ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలో ఈ నెల ఏడో తేదీ ఆదివారం నిర్వహించే భారీ బహిరంగ సభకు లక్ష మంది హాజరవుతారని టిడిపి ఉభయగోదావరి జిల్లాల సమన్వయకర్త గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శనివారం మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. పెద్దసంఖ్యలో జన సమీకరణకు పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయని వివరించారు. ఆచంట నియోజకవర్గం నుంచే సుమారు 40 వేల మందికిపైగా హాజరు కానున్నారని, ఈ సమీకరణ అంతా పితాని సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. సమావేశంలో మాజీ ఎంఎల్ఎలు ఆరిమిల్లి రాధాకృష్ణ, గన్ని వీరాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన సాగేదిలా

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం మధ్యాహ్నం 3:30 గంటలకు స్థానిక

ఏర్పాట్లు పూర్తి

ఎంపిడిఒ కార్యాలయం వెనుక ఉన్న లేఅవుట్‌లో హెలీప్యాడ్ వద్ద దిగనున్నారు. అక్కడి నుంచి రోడ్‌షో నిర్వహించుకుంటూ 3:50 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం మార్టేరు మీదుగా రోడ్డు మార్గంలో రాజమండ్రి వెళ్తారు.

డాగ్‌స్క్వాడ్ తనిఖీలు


చంద్రబాబు బహిరంగ సభ ప్రాంతాన్ని, హెలీప్యాడ్ ప్రాంతాన్ని డాగ్‌స్క్వాడ్ శనివారం సాయంత్రం తనిఖీ చేసింది. చంద్రబాబు రోడ్‌షో నిర్వహించే మార్గంలోనూ తనిఖీలు చేశారు. రోడ్‌షో తహశీల్దార్ కార్యాలయం మీదుగా రామేశ్వరస్వామి సత్రం, కచేరి సెంటర్ మీదుగా సాగనుంది. ఈ మార్గమంతా స్వాగత ద్వారాలు, పచ్చజెండాలతో అలంకరించారు.

సాంబమూర్తి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

విగ్రహావిష్కరణ సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భూపోరాట యోధుడు నాగిడి సాంబమూర్తి పోరాట స్ఫూర్తితో వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్న శక్తులపై పోరాడాలని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. నాగిడి సాంబమూర్తి కాంస్య విగ్రహావిష్కరణ శనివారం నాగిడిపాలెంలో జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ భూపోరాటాల ద్వారానే పేదల బతుకుల్లో కమ్యూనిస్టు పార్టీ వెలుగునింపిందన్నారు. వామపక్ష, లౌకిక కూటమి బలపడాలని ఆకాంక్షించారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ పేదవాడి గొంతు కమ్యూనిస్టులేనని, తనను కౌన్సిలర్‌గా కమ్యూనిస్టులే గెలిపించారని అన్నారు. పేదల ఆలోచనలు నెరవేరాలంటే కమ్యూనిస్టులను బతికించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ సాంబమూర్తి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పునరంకితం కావాలన్నారు. ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంలో సాంబమూర్తి పాత్ర ఎంతో ఉందన్నారు. లోసరి బ్రిడ్జికి నాగిడి సాంబమూర్తి పేరు పెట్టే ప్రతిపాదన సిఎం ద్వారా కేంద్రానికి పంపుతామన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, నాయకులు నెక్కంటి సుబ్బారావు, దారిదీపం సంపాదకులు డివిఎస్.వర్మ, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి, చంద్రానాయక్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బందన పూర్ణచంద్రరావు, సిపిఐ నాయకులు ఎం.సీతారాంప్రసాద్, చెల్లబోయిన రంగారావు, సర్పంచి నాగిడి దుర్గాభవాని, నారాయణస్వామి, ఎంపిటిసి నాగిడి మహాలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ నేత నారాయణ

మోకాళ్లపై నిల్చొని ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

18వ రోజు కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని ఆ సంఘం ఉద్యోగుల జెఎసి జిల్లా అధ్యక్షులు షేక్ బాబాజీ ప్రభుత్వాన్ని కోరారు. ఎస్ఎస్ఎ ఉద్యోగులు సమ్మెలో భాగంగా 18వ రోజు శనివారం మోకాళ్లపై నిల్చొని అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబాజీ మాట్లాడుతూ విజయవాడలో తమ నిరసన విజయవంతమైందన్నారు. ఈ సందర్భంగా పట్టణ ఉపాధ్యాయులు కెవి.మల్లేశ్వరరావు, గోవింద్, కిషోర్, సాయిరాం, నరేష్ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంతోషి, వాసు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సమ్మె శిబిరంలో నినదిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం



రానున్న సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని, దీనికి అనుగుణంగా ప్రతికూల పరిస్థితులను, ప్రాంతాలను ముందుగా గుర్తించి నివేదిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆర్‌డిఒలు, పోలీసు అధికారులతో ఆమె సమావేశమై జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. 2014, 2019 ఎన్నికలనాటి పరిస్థితులను బేరీజు వేసుకుని ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలన్నారు. బైండోవర్ డాక్యుమెంట్లను పకడ్బందీగా సిద్ధం చేయాలన్నారు. చెక్‌పోస్టుల్లో సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. ఆర్‌డిఒలు, డిఎస్‌పి నిఘావర్గాల సమాచారం ఆధారంగా అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఎఎస్‌పి వి.భీమారావు, సెబ్ ఎఎస్‌పి ఎటివి.రవికుమార్, డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, కె.చెన్నయ్య, ఎం.అచ్యుత అంబరీష్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, డిఎస్‌పిలు బి.శ్రీనాథ్, సి.శరత్‌రాజ్‌కుమార్, సెబ్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ భార్గవ్, ఎన్నికల తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

నిరసనల హోరు.. నేతలు బేజారు..!

'క్యాలెండర్ మారిందిగాని కష్టాలు మాత్రం తీరలేదంటున్నారు జిల్లాలోని వివిధ తరగతుల ప్రజలు. కొత్త ఏడాదొచ్చి వారం రోజులవుతోంది. అయితే తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనబాటలో ఉన్న చిరుద్యోగులు ఏమాత్రమూ వెనుకంజ వేయకుండా పోరాటాల సంవత్సరమా అనేటట్లుగా వివిధ రూపాల్లో నిరసనలు సాగిస్తున్నారు. ఓపక్క ఎన్నికలు.. మరోపక్క ఆందోళనల నడుమ.. భవిష్యత్తు ఏమిటా అని అధికార పార్టీ నేతలు మల్లగుల్లాలు పడుతుండగా, వీటిని ఎలాగైనా తమకు అనుకూలంగా మలుచుకోవాలని ప్రతిపక్షాలు వ్యూహాలు రచిస్తున్నాయి.


జిల్లాలో అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగిస్తుండగా ఉపాధ్యాయులు సైతం దశలవారీ ఆందోళన చేపడుతున్నారు. అందరి మాట.. అందరి డిమాండ్ ఒక్కటే 'మీరిచ్చిన హామీలు అమలు చేయండి.. మేం చేసిన పనికి సంబంధించి బకాయిలు ఇవ్వండి'.. అయితే ఇవేమీ పట్టని ప్రభుత్వం నిర్బంధానికి పూనుకుని అంగన్వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దీనిపై జిల్లాలోని అంగన్వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీరు మార్చుకుని తమ సమస్యలు పరిష్కరించకుంటే 'మా సమ్మెపై ప్రభుత్వ నిషేధం కాదు.. త్వరలోనే ఈ ప్రభుత్వాన్నే మేం నిషేధిస్తాం' అంటూ చేస్తున్న నినాదాలు అధికార పార్టీ నేతలను కలవరపరుస్తున్నాయి. ఇక మున్సిపల్ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం పోటీ కార్మికులను రంగంలోకి దింపగా ఎక్కడికక్కడ అడ్డుకుని వారిని వెనక్కి పంపుతున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు పోలీసులను రంగంలోకి దింపి మున్సిపల్ కార్మికులను అరెస్టు చేయించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇక ఎస్ఎస్ఎ ఉద్యోగులు ఎస్‌పిడి శ్రీనివాసరావు వ్యాఖ్యలతో రగిలిపోతున్నారు. ఇక యుటిఎఫ్ వినూత్నంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే విడుదల చేయాలంటూ చేపట్టిన దశలవారీ పోరు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. మొత్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులతోపాటు చిరుద్యోగులు ఒక్కసారిగా రోడ్డెక్కడం అధికార పార్టీ నేతలను కలవరపరుస్తోంది. ఈ నేపథ్యంలోనే అంగన్వాడీల సమస్యలు కచ్చితంగా ఈ ప్రభుత్వం పరిష్కరిస్తుందని మంత్రులే బుజ్జగించే ప్రయత్నం చేయడం గమనార్హం. ఇదే క్రమంలో వివిధ తరగతుల ప్రజల్లో వైసిపి ప్రభుత్వంలో నెలకొన్న అసంతృప్తిని ఈ ఆందోళనలు ప్రతిబింబిస్తున్నాయని, తమ జోరు పెంచేందుకు ఇవి కచ్చితంగా ఉపకరిస్తాయని ప్రతిపక్ష టిడిపి నేతలు హుషారుగా కదులుతున్నారు. ఆచంటలో 'రా.. కదిలిరా' పేరిట నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పెద్దసంఖ్యలో జనాన్ని తరలించేందుకు సమాయత్తమయ్యారు. అయితే ఆ పార్టీలోనూ ఇప్పటికీ సీట్ల కేటాయింపుపై స్పష్టత లేకపోవడం పెద్ద లోటుగా కన్పిస్తోంది. ఓపక్క జనసేనతో పొత్తు, మరోపక్క బలమైన నియోజకవర్గాల్లో గ్రూపు విభేదాలు ఆ పార్టీని వెంటాడుతున్నాయి. ఈ క్రమంలో ఆచంటలో నిర్వహించే సభలో తెలుగుతమ్ముళ్లకు చంద్రబాబు ఏమైనా సానుకూల సంకేతాలిస్తారేమోనని వారంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇక టిడిపితో పొత్తు ఖరారైనా జనసేన నేతల్లో మాత్రం జోరు కానరావడం లేదు. ప్రధానంగా జిల్లాలో ఏయే సీట్లు కేటాయిస్తారనే అంశం దగ్గర నుంచి పవన్ మళ్లీ భీమవరం నుంచి పోటీ చేస్తారా లేదా అనే మీమాంస ఆ పార్టీ నేతల్లో నెలకొంది. అదే క్రమంలో బిజెపితో పొత్తుపైనా సానుకూలంగా లేనట్లు తెలుస్తోంది. పెరిగిన ధరలు, రాష్ట్రానికి అన్యాయం వంటి అంశాలు బిజెపితో పొత్తు వల్ల తమకు ప్రతికూలమవుతాయని వారు అంతర్గత చర్చల్లో చెప్పుకోవడం విశేషం.



ఇదిలా ఉండగా అధికార పార్టీ వైసిపిలో ఇదే అనిశ్చితి కొనసాగుతోంది. చింతలపూడి సీటుపై పీటముడి వీడలేదు. ఓపక్క ప్రభుత్వ అధికారి విజయరాజుకు టిక్కెట్ ఓకే అయ్యిందని ఆయన అనుచరులు బాణసంచా కాల్చగా.. అదేమీ లేదని మళ్లీ ఎలిజాకే టిక్కెట్ అని ఆయన అనుయాయులు ఘంటాపథంగా చెబుతున్నారు. పోలవరంపై స్పష్టత వచ్చినా మిగిలిన సగం సీట్లకు సంబంధించి స్పష్టత రావాల్సి ఉండటం, ఎంపీ అభ్యర్థులెవరూ కానరాకపోవడం వంటి సమస్యలు అధికార పార్టీని వెంటాడుతున్నాయి. విధానాల ఫలితంగా ఏర్పడిన ప్రజావ్యతిరేకత, చిరుద్యోగుల ఆందోళనలు ఆ పార్టీకి తలనొప్పిగా పరిణమిస్తున్నాయి. మొత్తంగా చూస్తే కొత్త సంవత్సరంలో వివిధ తరగతుల ఆందోళనలు అందరిలోనూ చర్చనీయాంశమవుతున్నాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

-విఎస్‌ఎస్‌వి.ప్రసాద్



వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజా నేత అన్నే వెంకటేశ్వరరావు

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ఆదర్శప్రాయుడు, అమరజీవి, స్వాతంత్ర్య సమరయోధుడు రైతు, ప్రజా ఉద్యమ నేత అన్నే వెంకటేశ్వరరావు అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో వెంకటేశ్వరరావు వర్ధంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బలరాం పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. జిల్లాలో రైతు, వ్యవసాయ కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో వెంకటేశ్వరరావు ప్రధాన పాత్ర పోషించారన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల్లో ఆయన ఒకరన్నారు. ఆయన జీవిత భాగస్వామి అన్నే సీతారామమ్మ కూడా జిల్లాలో మహిళా ఉద్యమాన్ని నిర్మించడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బి.వాసుదేవరావు, కార్యకర్తలు ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, రత్నకుమార్, డేగల నాగు పాల్గొన్నారు.

కోవిడ్ పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - భీమవరం

కోవిడ్ పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని భీమవరం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యదేవి అన్నారు. స్థానిక శివరావుపేట కోర్టు ప్రాంగణంలో న్యాయ శాఖ ఉద్యోగులకు, న్యాయవాదులకు, ఆయుష్ శాఖ ద్వారా కోవిడ్ వ్యాధిపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సత్యదేవి మాట్లాడుతూ ప్రస్తుతం కోవిడ్ మళ్లీ విజృంభిస్తున్న సమయంలో న్యాయమూర్తులు, న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాదులు కోవిడ్ బారిన పడకుండా ముందుగానే జిల్లా జడ్జి ఆదేశాల మేరకు ఆయుష్ శాఖ ద్వారా హోమియో మెడిసిన్ క్యాంపును నిర్వహించనున్నట్లు తెలిపారు. భీమవరం ప్రభుత్వ హోమియో వైద్యులు రఫీయా పర్వీన్ షేక్ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, ఆహార నియమాలు, రోజూ సూర్యరశ్మి తగిలే విధంగా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎ.శ్రీరామ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం వద్ద వాలంటీర్ ధర్నా

ప్రజాశక్తి - పోడూరు

రాజకీయ ఒత్తిళ్లకు లొంగి మూడు నెలల బాలింతనైన తనను అకారణంగా విధుల నుంచి తొలగించారని గుమ్మలూరు గ్రామానికి చెందిన వాలంటీర్ రావి హెప్సిబా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయం వద్ద శనివారం 30 మంది లబ్ధిదారులతో కలిసి ధర్నా చేసింది. గత నెల 29వ తేదీన సమావేశానికి హాజరు కాలేదని మెమో ఇచ్చారని, దీనిపై ఎంపిడిఒను కలిసి సంజాయిషీ ఇచ్చిన తర్వాత ఆమె సంతృప్తి చెందారని వాలంటీర్ హెప్సిబా చెప్పారు. ఆ మరుసటి రోజే తనను విధుల నుంచి తొలగించామని సెక్రటరీ చెప్పారని, కారణం ఏంటని అడగగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించామని చెప్పారని తెలిపారు. తగిన కారణం చూపించకుండా విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తుంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని కోరింది.

మాముడూరు హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో జిల్లాస్థాయిలో మాముడూరు హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ సాధించారని ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. ఈ నెల ఐదో తేదీన వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో జిల్లా స్థాయిలో మూడు ప్రథమ బహుమతులు, ఒక ద్వితీయ, ఒక తృతీయ బహుమతులు సాధించారని తెలిపారు. మాముడూరు విద్యార్థులకు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జెసి రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి సర్టిఫికెట్, నగదు బహుమతులు అందించారు.

శాస్త్రవేత్తల జీవితాల గురించి తెలుసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

న్యూటన్, గెలీలియో, నోబెల్ అల్రైడ్, ఎడిసన్ వంటి శాస్త్రవేత్తల కృషి అమోఘమని, వారి జీవితాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. స్థానిక డిగ్రీ కాలేజీలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. శాస్త్రవేత్తలు తమ జీవితాల్లో తెలుసుకున్న విషయాలు ప్రజలకు వివరించారన్నారు. శాస్త్రవేత్తలపై బెస్ట్ ప్రజెంటేషన్ చేసిన సత్తు ప్రియకుమారి, దీపిక, అంజిబాబు, మౌనిక, సత్యవతి, శిరీషలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ లెక్చరర్లు టి.అక్కరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక సుబ్బారావు పేట భవిత వికలాంగుల పాఠశాల విద్యార్థులకు తాడేపల్లిగూడెం డైమండ్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కొప్పిశెట్టి రమణయ్య అధ్యక్షతన లయన్ లంకా శ్రీనివాస్ సంక్రాంతి పండుగ పురస్కరించుకుని గాలిపటాలు, క్రికెట్ కిట్ అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలు ఆసక్తికరంగా ఆటలు ఆడుతున్నారన్నారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుడు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం డైమండ్ లయన్స్ అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.జ్యోతి, ఉపాధ్యాయిని, కె.కుమారి, ప్రత్యేక ఉపాధ్యాయుని ఎం.చంద్రకుమారి, తాడేపల్లిగూడెం డైమండ్, కైండినెస్, అభయం లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

అసంపూర్ణంగా వదిలేసిన ఇళ్లను పూర్తిస్థాయిలో నిర్మించుకోవాలని హౌసింగ్ ఎఇ ఫణీంద్ర లబ్ధిదారులకు సూచించారు. కెపిపాలెం నార్త్‌లోని అసంపూర్ణంగా నిర్మించుకున్న ఇళ్ల లబ్ధిదారులతో శనివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని ఇళ్లను పూర్తిస్థాయిలో నిర్మించుకోవాలన్నారు. మండలంలో 327 ఇళ్లు అసంపూర్ణంగా మిగిలిపోయాయన్నారు. వారు ఈ నెలాఖరులోగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు రవి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రోడ్లపై చెత్త వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఆర్‌డిఎం ఎన్‌వి.సత్యనారాయణ మున్సిపల్ కమిషనర్ శ్యామలాదేవికి సూచించారు. స్థానిక భీమవరం పురపాలక సంఘ పరిధిలోని వార్డులను ఆయన శనివారం తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉన్న కారణంగా వార్డుల్లో శానిటేషన్ యధావిధిగా జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

నేరాలు - ఘోరాలు

ఉల్లంపర్రులో చోరీ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని ఉల్లంపర్రు గ్రామంలో శుక్రవారం రాత్రి ఒక ఇంట్లో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన పోతుల శ్రీలక్ష్మి కొన్నిరోజుల క్రితం హైదరాబాదు వెళ్లి తిరిగి శనివారం ఇంటికి వచ్చింది. ఆమె ఇంటికి వచ్చేసరికి తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న విలువైన మూడు పట్టు చీరలు, 250 గ్రాముల వెండి గిన్నె, రూ.రెండు వేల నగదు చోరీకి గురయ్యాయని గుర్తించి పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

స్పందించకుంటే ఉద్యమం మరింత ఉధృతం

మున్సిపల్ కార్యాలయాలను ముట్టడించిన మున్సిపల్ కార్మికులు

12వ రోజుకు సమ్మె


తణుకులో...

ప్రజాశక్తి - తణుకు రూరల్

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకూ ఉద్యమం ఆగదని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్, ఎఐటియుసి జిల్లా నాయకులు బొద్దాని నాగరాజు హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమ్మె శనివారంతో 12వ రోజుకు చేరుకుంది. స్థానిక సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. పోలీసులు వచ్చి నాయకులు పి.వి.ప్రతాప్, కామన మునిస్వామి, బొద్దాని నాగరాజు, అడ్డగర్ల అజయకుమార్, గార రంగారావులను బలవంతంగా లాక్కుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. పోలీస్ జులుం నశించాలని, అక్రమ అరెస్టులు ఖండించాలని, ఇచ్చిన మాట ప్రకారం హామీలు అమలు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కామన మునిస్వామి ఆధ్వర్యంలో కార్మికులు పోలీస్‌స్టేషన్ వద్ద బైఠాయించి అరెస్టులు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ధర్నా చేశారు. నాగరాజు, ప్రతాప్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేవరకూ పోరాటం ఆగదన్నారు. పోటీ కార్మికులను అడ్డుకుని పంపించి వేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఆది నారాయణ, కృష్ణబాబు, కేశవ, మండలవుల్లు, అయ్యప్ప, నాగేంద్ర కుమార్, ఎం.ముత్యాల, కె.రవిబాబు, మార్, గండ్ర క్రిస్, జి.వెంకటేశ్వరరావు, జి.అన్న పూర్ణ, ఎం.లక్ష్మి, సుధాకర్, జ్యోతి బాబు, అనంతలక్ష్మి, రాజేశ్వరి, రాజమ్మ పాల్గొన్నారు.


తణుకులో నాయకులను బలవంతంగా లాక్కెళ్తున్న పోలీసులు



నరసాపురంలో...

తాడేపల్లిగూడెం : మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె విరమించేది లేదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించి అధికారులను, ఉద్యోగులను విధులకు వెళ్లనియకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 12 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా సమస్యలు పరిష్కరించకపోవడం సమ్మె విచ్ఛిన్నానికి ప్రయత్నించడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే రానున్న కాలంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.సతీష్, దనాల రాజు, భాను, దయామని, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ తక్షణం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


తాడేపల్లిగూడెంలో...

కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, మున్సిపల్ కార్మిక, ఉద్యోగులు ఎంవి.సత్యనారాయణ, సిహెచ్.వాసు, టి.పార్థసారథి, మధు, అనంతలక్ష్మి, టి.కల్యాణి, ఎస్‌కె.అమీన, కె.సుజాత, డి.వరలక్ష్మి, భవాని పాల్గొన్నారు.

ఘనంగా అద్దేపల్లి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు విద్యార్థులు నేటికీ డిగ్రీలు చదువుతున్నారంటే దానశీలి అద్దేపల్లి సత్యనారాయణమూర్తి కృషి వల్లేనని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. అద్దేపల్లి జయంతి సందర్భంగా గాంధీ బొమ్మ సెంటర్ సమీపంలో ఆయన విగ్రహానికి రామానాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం ఆయన వద్ద డబ్బులు లేకపోతే ఒక రైస్ మిల్ అమ్మి డిగ్రీ కళాశాల స్థాపించారని గుర్తు చేశారు. ఆనాడు వంద ఆవుల పాలను చిన్నారులకు ఉచితంగా పంపిణీ చేసిన దానశీలి అని కొనియాడారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, అద్దేపల్లి వారసుడు అద్దెపల్లి మోహన్, టిడిపి నేతలు కర్నేన గౌరు నాయుడు, రేపాక ప్రవీణ్ భాను, యిమ్మిడి రాజేష్, పెచ్చెట్టి బాబు పాల్గొన్నారు.

జీడి మామిడి తోటల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గిరిజన రైతులకు జీడి మామిడి తోటల పెంపకంలో లేత అంటుకట్టే పద్ధతిపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ఏలూరు జిల్లా బుట్టాయగూడెం రైతులు నిర్వహించారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వెంకటరామన్నగూడెం ఉద్యాన కళాశాలలో అఖిలభారత వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ జీడి మామిడి సాగు చేసే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని గిరిజన రైతులకు అందించాలని ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. కీటక శాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ ఇమ్మనుయేలు, ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటెడ్ ప్రొఫెసర్ ఎం.కల్పన, డాక్టర్ టిఎస్‌కె.కిరణ్ పాత్రో మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ చాందిని రాజ్, డాక్టర్ రవికిరణ్, పీజీ, పిహెచ్‌డి విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణంలో రూ.వంద కోట్ల అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణాభివృద్ధికి గత నాలుగున్నరేళ్లుగా రూ.వంద కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గంలో రూ.మూడు కోట్ల నిధులతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో గ్రంధి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విలేకర్లతో మాట్లాడారు. తొలుత 26వ వార్డు సెంటాన్ స్కూల్ ఏరియాలో రూ.84 లక్షల నిధులతో నిర్మించే సీసీ రోడ్డుకు, అదే వార్డులో రూ.1.62 కోట్లతో నిర్మించే రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం యనమదుర్రులో రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.29 లక్షలతో నిర్మించిన హరిజనపేటలో, రజకుల వీధిలో నిర్మించిన సీసీ డ్రెయిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు, వారి సూచన మేరకు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

వ్యాయామం, క్రీడలు ఆరోగ్యానికి దోహదపడతాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని ఎల్‌బి.చర్ల గ్రామం జిల్లా పరిషత్ హైస్కూలులో సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ముగింపు సభకు ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సచివాలయాల పరిధిలో గెలుపొంది ఎంపికై మండల స్థాయిలో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమని నాగరాజు, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, బొక్క రాధాకృష్ణ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు చల్లారావు, దొంగ మురళి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ప్రజా ప్రతినిధులు, పిఇటిలు, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

అలరించిన పంచరత్న కీర్తనలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక సంగీత విద్వాంసులతో పంచరత్న కీర్తనలు నిర్వహించారు. స్థానిక శ్రీరామ భక్త సంకీర్తన సమితి ఆధ్వర్యంలో కీర్తిశేషులు వింజరపు రామకృష్ణ శిష్య బృందం 16 మంది ఈ కీర్తనల్లో పాల్గొన్నారు. వీరందరినీ మ్యూజిక్ అకాడమీ సభ్యులు సత్కరించారు. నిర్వహణ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ స్థానిక విద్వాంసులను ప్రోత్సహించాలనే తలంపుతో తమ అకాడమీ ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామన్నారు. సంగీత విద్వాంసులు కొత్త విజయలక్ష్మి, కురిశేటి లక్ష్మి నాగమణి, పెద్దడ శాంతికుమారి, సంక శారద, నండూరి రమవతి శిష్య బృందంతో కీర్తనలు సాగించారు. కారుమురి చినబాబు, అరసవల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు త్వరగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



ఓటరు జాబితాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - కాళ్ల

ఓటరు నమోదు, తొలగింపు, జాబితాలో మార్పులు త్వరితగతిన భారత ఎన్నికల కమిషన్ సూచనల మేరకు పరిష్కరించాలని కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. మండలంలోని బొండాడ గ్రామ సచివాలయంలో ఫొటోస్ సిమిలర్ ఎంట్రీస్ (పిఎస్ఇ), డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్ (డిఎస్ఇ) తొలగింపుల ప్రక్రియను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రశాంతి మాట్లాడుతూ డిసెంబరు తొమ్మిదో తేదీ తర్వాత అందిన ధరఖాస్తులు, అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ విషయమై ఓటరు రిజిస్ట్రేషన్ అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. ఫొటో సిమిలర్ ఎంట్రీస్, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీసు ద్వారా ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదైన వివరాలు పరిశీలించి ఎన్నికల కమిషన్ సూచనల మేరకు పరిష్కరించాలన్నారు. ఓటరు రిజిస్ట్రేషన్ అధికారులు వారి నియోజకవర్గం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని గుర్తించి వివరాలు పంపించాలని ఆదేశించారు. ఓటర్ రిజిస్ట్రేషన్ అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించి వాటిలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా అనేది పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిఎల్ఒలు, విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యను అందరూ ప్రోత్సహించాలి

డిఇఒ ఆర్‌వి.రమణ




మాట్లాడుతున్న డిఇఒ రమణ

ప్రజాశక్తి - కాళ్ల

విద్యను అందరూ ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్‌వి.రమణ అన్నారు. మండలంలోని కోపల్లెలో ఎస్ఎండిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐక్య నేషనల్ ఫౌండేషన్ భీమవరం (స్వచ్ఛంద సేవా సంస్థ) వారి ఐక్యత పద్మభూషణ్ సుధామూర్తి గ్రూపును జిల్లా విద్యాశాఖాధికారి ఆర్‌వి.రమణ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆర్‌వి.రమణను ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నిర్మలాదేవి, ఫౌండేషన్ సభ్యులు, ఛైర్మన్ శివరామరాజు, సెక్రటరీ డివిఎస్.చంద్రాజీ, అధ్యక్షులు వైఎస్.ఆచారి, వైస్ ప్రెసిడెంట్ ఎం.గోపాలరాజు, కె.సుబ్బరాజు, పాఠశాల స్థల దాత మంతెన రామ్‌కుమార్ రాజు, పాఠశాల అభివృద్ధి కమిటీ బంగార్రాజు, నల్ల విజయ లక్ష్మి, ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నల్ల కిరణ్‌ప్రసాద్, పాఠశాల సెక్రటరీ ఎస్.మాణిక్యాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.


పాలకొల్లులో అమరజీవుల సంస్మరణ సభ


సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - పాలకొల్లు

అమరజీవులు ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, ఉపాధ్యాయ నిర్మాత ఎస్ఆర్ పోలిశెట్టి సంస్మరణ సభ, సావిత్రిబాయి పూలే 193వ జయంతి పాలకొల్లులో శనివారం నిర్వహించారు. యుటిఎఫ్ సారథ్యంలో సభలు నిర్వహించారు. అమరజీవి పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత ఎస్ఆర్.పోలిశెట్టి 23వ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. సామాజిక విప్లవ కారిణి, ఆధునిక భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయిని మాత సావిత్రిబాయి పూలే 193వ జయంతి మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించారు. సమావేశానికి మండల శాఖ అధ్యక్షులు గుత్తిందివి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మండల శాఖ నాయకురాలు సరెళ్ల లక్ష్మి, బూరగడ్డ శైలజ, బి.విజయ పద్మ, గొర్రెల మాధవి ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ నాయకురాలు దండు పద్మావతిని, సీనియర్ ఉపాధ్యాయిని కొప్పాడ పద్మజను సత్కరించారు. స్థానిక బివిఆర్ఎం గర్ల్స్ హై స్కూల్లో జరిగిన కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపీమూర్తి, రాష్ట్ర పూర్వ కార్యదర్శులు సరిపల్లి జయప్రభ, పివి.నరసింహారావు, వి.కనకదుర్గ, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండు పద్మావతి, యుటిఎఫ్ వ్యవస్థాపక సభ్యులు వలవల శ్రీరామ్మూర్తి, జిల్లా నాయకులు కె.రాజశేఖర్, పి.క్రాంతికు మార్, ఎంవి.రాజశేఖర్, పులఖండం శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు దేవ సుధాకర్, యర్ర అజయ్ పాల్గొన్నారు.

రంగసాయికి పూర్ణకుంభ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న రంగసాయి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల ఐదో తేదీన రాజమండ్రిలో ఆంధ్ర సర్వసత పరిషత్, చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భీమవరానికి చెందిన సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి పూర్ణ కుంభ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రంలోనే స్వాతంత్ర్య ఉద్యమం, సినిమా, నాటక, సంగీత, సాహిత్య, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలందించిన 72 మందికి ఈ పూర్ణ కుంభ పురస్కారాలు అందించారని రంగసాయి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు పద్మభూషణ్ యార్లగడ్ల లక్ష్మీప్రసాద్, ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్, తెలుగు మహాసభల నిర్వాహకులు గజల్ శ్రీనివాస్, చైతన్యరాజు చేతుల మీదుగా పూర్ణ కుంభ పురస్కారాన్ని అందుకున్నామని తెలిపారు. డొక్కా సీతమ్మ, కందుకూరి, గుర్రం జాషువా, ఘంటసాల, జమున రాణి వారి కుటుంబ సభ్యులతోపాటు మరి కొంతమందికి ఈ అవార్డులను అందించారని తెలిపారు. క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాస్‌రాజును సత్కరించారని తెలిపారు. టిటిడి పాలకవర్గ సభ్యులు గాదిరాజు సుబ్బరాజు, ప్రముఖ సినీనటులు తనికెళ్ల భరణి పాల్గొన్నారని తెలిపారు.

రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

నరసాపురం టౌన్ :రహదారుల అనుసంధానంతో నరసాపురం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెంది రూపురేఖలు మారనున్నాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని లక్ష్మణేశ్వరం నుంచి దర్భరేవు, సారవ నుంచి వేములదీవి కరింశెట్టి వారి పాలెం వరకు రూ.3 కోట్లతో నిర్మించే బిటి రోడ్లకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని ఎల్‌బి చర్ల గ్రామంలో రూ.50 లక్షలు 15వ ఫైనాన్స్ నిధులతో నిర్మించే బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ నాగరాజు, దర్భారేవు సర్పంచి పెన్మత్స విజయలక్ష్మి, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు బొక్క రాధాకృష్ణ, ఎంపిపి మైలాబత్తుల సోనీ, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్‌నాయుడు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు, గ్రామ సర్పంచులు కైలా లావణ్య సతీష్, తిరుమని వెంకటరాజు, గుబ్బల వేమున, ఎంపిటిసి సభ్యులు లక్ష్మీ శ్రీనివాస్, పులపర్తి రామకృష్ణ, ఆర్అండ్‌బి డిఇ జివిఎస్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి గ్యారేజీ డిపోల సందర్శన

ప్రజాశక్తి - మొగల్తూరు

ఆర్‌టిసి కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్‌టిసి విజిలెన్స్ ఛైర్మన్ పెన్మెంట్స మహేష్ అన్నారు. నరసాపురం ఆర్‌టిసి గ్యారేజీ డిపోలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌టిసి కార్మికులకు ఏ అవసరం వచ్చినా తమను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా బాధ్యతగా విధులు నిర్వహించిన ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిపిటిఒ వీరయ్య చౌదరి, ఇన్‌ఛార్జి డిఎం సత్యనారాయణ మూర్తి, అసిస్టెంట్ డిఎం టి.ధనలక్ష్మి, డిఎం ఇ పీతల రవీంద్రబాబు పాల్గొన్నారు.

'8 లోపు అంగన్వాడీలు విధులకు హాజరవ్వాలి'

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినీ అంగన్వాడీ వర్కర్స్ ఈ నెల 8వ తేదీన తమ అంగన్వాడీ సెంటర్లో విధులకు హాజరవ్వాలని ఐసిడిఎస్ పీడీ సుజాతరాణి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం విధించిన గడువు లోపు విధులకు హాజరు కాని అంగన్వాడీలు ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులని పేర్కొన్నారు.

'అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించాలి'

ప్రజాశక్తి - పాలకొల్లు

రానున్న ఎన్నికలు అరాచక ప్రభుత్వానికి, ప్రజాస్వామ్య ప్రభుత్వానికి మధ్య జరిగే పోరాటమని ఆచంట రా కదలిరా సభ అబ్జర్వర్, మాజీ మంత్రి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శనివారం ఆయన పాలకొల్లు వచ్చిన సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజలు తిరుగుబాటు చేయడంతో జగన్ దిక్కుతోచక ఉన్నారని చెప్పారు. ఆచంట సభకు దాదాపు లక్షకు పైగా టిడిపి అభిమానులు వస్తున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

'టిడిపి, జనసేన కలయిక నవశకానికి నాంది'

ప్రజాశక్తి - ఉండి

టిడిపి, జనసేన కలయిక నవ శకానికి నాంది అని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంతెన రామరాజు, జుత్తిగ నాగరాజు మాట్లాడారు. రాష్ట్రంలో నియంత పరిపాలనను కొనసాగిస్తున్న వైసిపిని గద్దె దించేందుకే టిడిపి, జనసేన పొత్తు పెట్టుకున్నాయని తెలిపారు. ఏడో తేదీన ఆచంట నియోజకవర్గంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, టిడిపి మండల కార్యదర్శి కరిమెరక నాగరాజు, నాయకులు జుత్తిగ శ్రీనివాస్, కాగిత బుజ్జి, చెన్నంశెట్టి హరినాయుడు, యర్రా రవి, గురుగుబిల్లి సత్యనారాయణ, కిన్నెర వెంకన్న, మోపిదేవి హరి, పెదపాటి ప్రసాద్ పాల్గొన్నారు.